క్లుప్తంగా

నేడు పాందువ్వలో గడపగడపకు మన ప్రభుత్వం

ఉండి: మండలంలోని పాందువ్వ గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్కే ఆంజనేయరాజు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యాన జరిగే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

మానసిక రోగులకు అవగాహన

సాక్షి, భీమవరం: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శాంతి హాస్పిటల్‌లో డాక్టర్ జీవీ రమణరావు అధ్యక్షత మానసిక రోగులకు చట్టపరమైన హక్కుల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ధనరాజు మాట్లాడుతూ మానసిక రోగుల పై ఎలాంటి కేసు నమోదు చేయాలన్నా కోర్టు అనుమతి తప్పనిసరిని, న్యాయ సేవాధికార సంస్థ మానసిక రోగులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ రమణరావు, డాక్టర్ జీవీ వాణి రమణారావు, డాక్టర్ జి.సుభాష్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

సాక్షి, భీమవరం: భీమవరం టుటౌన్ ఏరియాలోని చెట్టుకింద సాయిబాబా గుడివీధికి చెందిన ఎ రోషిరెడ్డి అదృశ్యమైనట్లు అతని భార్య ధనలక్ష్మి పిర్యాదు చేసినట్లు టుటౌన్ ఎస్సై ఫణిమోహన్ మంగళవారం చెప్పారు. తామంతా ఈనెల 4న ఖమ్మం వెళ్లి తిరిగి భీమవరం రాగా తమను ఆటోలో ఇంటికి పంపించిన తన భర్త అప్పటినుంచి ఇంటికి రాకపోవడమేగాక ఎటువంటి సమాచారం లేదు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది.

బ్యాటరీల దొంగ అరెస్టు

సాక్షి, భీమవరం: వాహనాల్లో బ్యాటరీలు దొంగిలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు మంగళవారం భీమవరం టుటౌన్ సీఐ జి.శ్రీనివాస్ చెప్పారు. టుటౌన్ పరిధిలోని రాయలం, బైపాస్ రోడ్డు ప్రాంతాల్లోని లారీలు, ట్రాక్టర్లలోని బ్యాటరీలను పాలకోడేరు మండలం మోగల్లు గ్రామానికి చెందిన పి మణికంత దొంగిలించడంతో కేసు నమోదు చేసి మణికంతను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్ చెప్పారు.

పేదలకు అండగా జగనన్న ఆరోగ్య సేవలు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరం అర్బన్: లోసరి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వృద్ధురాలి ఆరోగ్యంపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



పాలకోడేరు: గొల్లలకోడేరులో పోషకాహార పదార్థాల ప్రదర్శనను పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



ఉండి: వాండ్రంలో ఆరోగ్య సురక్ష వైద్య సేవలను పరిశీలిస్తున్న నాయకులు



ఆకివీడు: సిద్ధాపురం సురక్ష వైద్య శిబిరానికి వృద్ధుడిని తీసుకువస్తున్న దృశ్యం



కాళ్ల: మాలవానితిప్ప గ్రామంలో గర్భిణులకు పోషకాహార కిట్లు అందజేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను పేదప్రజలకు అండగా నిలుస్తున్నాయని, ఈ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కోరారు. మండలంలోని లోసరి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఎంతోమంది చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టిలో పెట్టుకుని ఆరోగ్య సురక్ష సేవలను ప్రారంభించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ దాసి రాజు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్, ఉభయ గోదావరి జిల్లాల సేవాదళ్ కన్వీనర్ చినిమిల్లి వెంకట్రాయుడు, సర్పంచ్ రామాని శివాజీ వర్మ, ఎంపీటీసీ సభ్యుడు బొమ్మిడి కొండరాజు, గుద్దటి రాంబాబు పాల్గొన్నారు.

గ్రామాలభివృద్ధే లక్ష్యం

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాలభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దెత్తున నిధులు వెచ్చిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని లోసరి గ్రామంలో రూ. 40 లక్షల నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో అర్హులైన లబ్ధిదారులకు జనన, మరణ, కుల, ఆదాయ ధృవ పత్రాలు, ప్రభుత్వ ఇచ్చే ఇళ్ల స్థలాలు, నిర్మాణాలకు కాళ్లు అరిగేలా మండలాఫీసులు, తహసీల్దార్ కార్యాలయాలు చుట్టూ తిరిగేవారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రతి 50 కుటుంబాలకు వలంటీర్ ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ స్వామి నాయుడు, ఎంపీడీఓ కె. వెంకటలక్ష్మీ, రామాని కాస్తో వర్మ, కొప్పర్తి సత్యనారాయణ, తిరుమాని ధనంజయరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు

కాళ్ల: ప్రజల చెంతకే వైద్య సేవలు తీసుకొచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి భద్రత కల్పిస్తున్నారని మాలవానితిప్ప సర్పంచ్ సాగిరాజు సుబ్బరాజు తెలిపారు. గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభినందనీయులని కొనియాడారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే శివారు గ్రామమైన మాలవానితిప్ప అభివృద్ధికి పీవీఎల్ నర్సింహరాజు పూర్తి సహకారం అందిస్తున్నారని చెప్పారు. వైద్య శిబిరానికి పెద్ద ఎత్తున గ్రామస్తులు రాగా, నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహార పదార్థాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. గర్భిణులకు పోషకాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు గులాబ్ రాజ్ కుమార్, ఎస్.సునీల్, మండల ఏవో ప్రభాకర్, ఉప సర్పంచ్ సత్యనారాయణ రాజు, మంతెన రంగరాజు, వీఆర్వో రామాంజనేయులు పాల్గొన్నారు.

పేదవాని ప్రాణానికి అండగా..

ఉండి: పేదవాని ప్రాణానికి జగనన్న ఆరోగ్య సురక్ష అండగా నిలుస్తోందని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ మహంకాళి అన్నారు. మంగళవారం మండలంలోని వాండ్రంలో గ్రామ సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యుడు పీవీఆర్కే ఆంజనేయరాజు ఆధ్వర్యాన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ, జెడ్పీటీసీ, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అద్భుతమైన సంక్షేమం దేశం మొత్తం మీద ఒక్క మన రాష్ట్రంలోనే జరుగుతోందన్నారు. వైద్యసేవలు ఖర్చుతో కూడుకున్న ఈ రోజుల్లో పేదవాని కోసం ఎంత కష్టమైనా వారి ప్రాణాలు కాపాడేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని రూపకల్పన చేశారని అన్నారు. నిపుణులైన ప్రైవేటు డాక్టర్లను ఈ క్యాంప్‌లకు రప్పించి మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు బుద్ధరాజు రంగరాజు, ఉప సర్పంచ్ ముదుండి ప్రేమస్వరూప శ్యామ్, కోనాల రాజేంద్ర, గ్రామ సచివాలయ కన్వీనర్లు, మండల ప్రత్యేకాధికారి ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యమే లక్ష్యం

పాలకోడేరు: అందరికీ ఆరోగ్యం అన్నది నినాదం కాకూడదని, దాన్ని నిజం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృఢ నిశ్చయంతో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గొల్లలకోడేరులో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు), ఉండి మార్కెట్ యార్డ్ చైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ చేకూరి రాజా నరేంద్ర కుమార్‌తో కలిసి పీవీఎల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరంలో వైద్యారోగ్యశాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను పరిశీలించిన వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన సభలో నర్సింహరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటు ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాజా నరేంద్ర కుమార్, సర్పంచ్ కుక్కల లక్ష్మి, సర్పంచుల చాంబర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, బొల్లా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మీతులసి, ఎంపీటీసీ సభ్యులు కరోతి వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, కాటూరి శాంతకుమారి, ఏఎంసీ డైరెక్టర్ గుండు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కటిక శ్రీదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి చినమిల్లి రంగనాయుడు, పార్టీ నాయకులు పెన్మెత్స శ్రీనివాసరాజు, కలిదిండి కృష్ణంరాజు, దుండి అశోక్ బాబు, అవుదు శ్రీను పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

వీరవాసరం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు తెలిపారు. మత్స్యపురి గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంతో బాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారని వివరించారు. సర్పంచ్ కురెళ్ల వెంకట పద్మావతి, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్‌కుమార్, కడలి ధర్మారావు, గూదూరి ఓంకార్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో విప్లవాత్మకమైన మార్పులు

ఆకివీడు: జగనన్న పాలనలో అన్ని రంగాల్లో ప్రజలు విప్లవాత్మకమైన మార్పులు చూస్తున్నారని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మండలంలోని సిద్ధాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను) ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో యండగండి శ్రీను, ఏఎంసీ చైర్మన్ రసూల్ బీబీ, ఎంపీపీ కఠారి జయలక్ష్మి మాట్లాడుతూ విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. శిబిరంలో ఈసీజీ, రక్త, షుగర్ పరీక్షలు, గుండె పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి వృద్ధులను సర్పంచ్ చిట్టిబాబు, ఉప సర్పంచ్ ఇందుకూరి నారాయణరాజు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పళ్ళెం అరుణకుమారిలు దగ్గరుండి తీసుకువెళ్లారు. సుమారు 850 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జేసీఏ పుప్పాల పండు, వైస్ ఎంపీపీ కిల్లి రామకృష్ణ, మాజీ సర్పంచ్‌లు జంపన సత్యనారాయణరాజు, తోట శివాజీ, మాజీ ఉప సర్పంచ్ భూపతిరాజు బుజ్జిరాజు, ఎంపీడీఓ కందుల వాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మోగల్లులో ఆరోగ్య సురక్ష సర్వే

పాలకోడేరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ముందు మోగల్లు గ్రామ సచివాలయం 1 పరిధిలో మంగళవారం వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరి పేర్లు, వారి అనారోగ్య వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. నమోదైన వెంటనే వీరికి మెడికల్ షీట్ జనరేట్ అవుతుంది. దాని ఆధారంగా వైద్యులు సురక్ష శిబిరంలో వైద్యం చేస్తారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు సునంద, ఇందిర ఏఎన్ఎంలు ధనలక్ష్మి, ఉషారాణి, ఉషా సుందరి, ఆశా వర్కర్లు సత్యవతి, చంటమ్మ, వలంటీర్ కోలా గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో 24 గంటల హ్యాకథాన్

సాక్షి, భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 19, 20 తేదీల్లో హ్యాకథాన్ ఓవర్ ఫ్లో–2కే పేరిట 24 గంటల హ్యాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కేవీ మురళీకష్ణంరాజు చెప్పారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు తమ ప్రతిభ నైపుణ్యాన్ని వెలికితీసేందుకు హ్యాకథాన్ దోహదపడుతుందన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు పాల్గొన్నారు.

రుణం పేరుతో టోకరా

ఉండి: మండలంలోని ఉణుదుర్రు గ్రామానికి చెందిన ఎం.నాగ వెంకట దుర్గారావు అనే వ్యక్తి ఆన్‌లైన్ మోసానికి గురై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో కిరాణా షాపు నడుపుకుంటున్న నాగ వెంకట దుర్గారావుకు ఫేస్‌బుక్‌లో అకౌంట్ ఉంది. దానిలో ఓ బ్యాంక్ ఏటీఎం పెట్టుకోవాలనుకుంటే క్లిక్ చేయండి అని ఓ యాడ్ రావడంతో అతని కుమారుడు దానిపై క్లిక్ చేశాడు. అనంతరం వివరాలు నమోదు చేశాడు. అవతలవైపు నుంచి సెల్: 82932 70562 నంబర్ నుంచి ఫోన్ చేసి ఏటీఎం పెట్టుకునే వారికి రూ.5 లక్షలు వ్యక్తిగత లోన్ ఇస్తామని, దానికి కమీషన్‌గా రూ.91,250 చెల్లించాలని చెప్పడంతో ఫోన్‌పే ద్వారా సదరు వ్యక్తికి నగదు బదిలీ చేశారు. అప్పటి నుంచి అవతలవైపు వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన నాగ వెంకట దుర్గారావు పోలీసులను ఆశ్రయించాడు. ఎస్సై కె.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తపాలా శాఖ సేవలను వినియోగించుకోవాలి

సాక్షి, భీమవరం: తపాలా శాఖలో అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువలో అమలు జరుగుతున్నాయని భీమవరం హెడ్ పోస్ట్ మాస్టర్ ఎస్ఎస్‌సీహెచ్ ఆచార్యులు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, తపాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత ప్రభుత్వ తపాల శాఖ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కేజీఆర్ఎల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సహకారంతో తపాలా శాఖ సంక్షేమ పథకాలు విద్యార్థులకు సంబంధించిన పోస్టల్ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్యులు మాట్లాడుతూ మహిళ సమ్మాన్, సేవింగ్స్ సర్టిఫికెట్స్, 21 ఏళ్ల సుకన్య సమృద్ధి స్కీమ్ ఇటువంటి పథకాలు విశేషంగా సమాజంలో నడుస్తున్నాయన్నారు. పోస్టల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కె శ్రీనివాస్ పోస్ట్ పథకాలపై వివరించారు. అనంతరం విద్యార్థులకు పోస్టల్ స్కీమ్ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మెంటే హరినాథ్‌బాబు, చెరుకువాడ రంగసాయి, ఐ రామచంద్రమూర్తి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సుధాకర్, జ్యోతి, అరసవల్లి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ స్కీమ్ పత్రాలను అందిస్తున్న దృశ్యం

ఆక్రమణల తొలగింపు

ఆకివీడు: రహదారి విస్తరణలో భాగంగా మండలంలోని పెద కాపవరం గ్రామంలో రోడ్డు మార్జిన్లలో ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్నారు. కేంద్ర రహదారి అభివృద్ధి సంస్థ నిధులు సుమారు రూ.25 కోట్లు మంజూరు కావడంతో భీమవరం–కొల్లేరు రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో పెద కాపవరం పరిధిలో పలు చోట్ల మార్జిన్లు ఆక్రమించి గోడలు, ఇళ్లు నిర్మించుకోవడంతో వాటి తొలగింపునకు గత కొన్ని రోజులుగా విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సూచనల మేరకు ఆర్ అండ్ బి విస్తరణలో భాగంగా అవసరమైన స్థలం మాత్రమే తీసుకోవాలని సూచించడంతో ఆ మేరకు తొలగింపు పనులు చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఆర్ అండ్ బి అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

శరవేగంగా భీమవరం పట్టణాభివృద్ధి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో రూ. 40 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్ల కాలంలో భీమవరం పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రతి వార్డులో కూడా ప్రజల సూచన మేరకు, వారి సలహాలు మేరకు సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నామని అన్నారు. భీమవరంలోని ప్రతి వార్డులో కూడా పూర్తిస్థాయిలో అంతర్గత రోడ్లు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ఎంఈ త్రినాథరావు, వార్డు ఇన్‌చార్జ్ కానుబోయిన వెంకటరమణ, నందమూరి ఆంజనేయులు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు, కోడె యుగంధర్, బొక్క గోపి, చెల్లంకి గిరి, వేంద్ర విజయదుర్గ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

భీమవరం అర్బన్: ఇతరుల ప్రవర్తనపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్సై బి.మోహన్‌రావు అన్నారు. మండలంలోని తాడేరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై బి. మోహన్‌రావు మాట్లాడుతూ ఇతరులు విద్యార్థినులతో అస్యభకరంగా మాట్లాడినా, ప్రవర్తించినా ఆదిలోనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు.

సామాజిక చైతన్యం తీసుకురండి

ఆకివీడు: పట్టణ పేదరిక నిర్మూలన మిషన్(మెప్మా) ఆర్పీలు ప్రజల సామాజిక చైతన్యం కోసం కృషి చేయాలని ఆకివీడు రూరల్ సీఐ కె.సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి నివాసంలో మంగళవారం ఆర్పీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ బ్యాంకులు, ఏటీఎంలో మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. మహిళా సాధికారతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళల చైతన్యానికి ప్రభుత్వం పనిచేస్తోందని, డ్వాక్రా, మెప్మాల ద్వారా మరింత కృషి చేయాలని తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్ కుమార్ సూచించారు. కార్యక్రమంలో ఆర్పీల సంఘ అధ్యక్షురాలు కృష్ణవేణి, భారతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకారం

కాళ్ల: గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాట్ల వెంకట రామరాజు అన్నారు. మండలంలోని కాళ్లకూరులో పరిశుద్ధ నిర్మలా మాత మందిరం వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యాన అన్నదానం చేశారు. దాత రామరాజును గ్రామ పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు, సోడదాసి గంగయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

ఆకివీడు: మండలంలోని పెద కాపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు విర్ బాక్ కంపెనీ బహూకరించిన రూ.2 లక్షల విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్ కంపెనీ రీజినల్ బిజినెస్ మేనేజర్ ఎంవీవీ సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షిత నీటిని తాగడం వల్ల విద్యార్థుల్లో ఆరోగ్యం స్థిరంగా ఉంటుందన్నారు. వ్యాధులకు గురికాకుండా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీకాళహస్తీశ్వరుడు, పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు కొటికలపూడి సురేష్, పుచ్చకాయల బ్రహ్మజీ పాల్గొన్నారు.